# కాలమహిమ

రచన :
శ్రీ చేనూతల నారాయణరావు

కాలం ఒక్కమాదిరిగా ఉండదు. కాలాన్ని బట్టి మనుష్యులు కూడా మారిపోతారు కాలం మనుష్యులను నామరూపాలలేకుండా ఛిన్నాభిన్నం చేసేస్తుంది. అదే కాలానికున్న వైపరీత్యం.

"నేషనల్ రెస్టారెంటు" లో కాఫీ త్రాగి సిజర్ సిగరెట్టు ఒకటి వెలిగిస్తూ మెల్లగా పైకి ఊడబడుతున్నాను. ఏదో గొంతు గొనగడం వినిపించింది పావలా డబ్బులుంటే ఇప్పించమని. వెనక్కి తిరిగి చూసాను. ఎవడో ముష్టివాడులా కనిపించాడు. పంచెనిండా చిరు కనిపిస్తున్నాయి. కమీజు అక్కడక్కడా మాసికలు వేయబడి ఉన్నది. బాగా మాసిపోయి కంపు కొట్టున్నాయి. వాటికి తోడు దట్టంగా మాసిన గడ్డం. తైల సంస్కారం లేక మొక్కజొన్న పీచులా గాలి ఎటు వీస్తే అటు ఊగే తల. వీటికి మించిన హంగులలో దైన్యంతో కూడిన అతని ముఖం. మనిషి గొంతును బట్టి చూస్తే ఎక్కడో చూసిన వాడులా జ్ఞాపకం. చూడ్డమే కాదు. బాగా పరిచయిస్తుడులాగానే కనిపిస్తున్నాడు. కాని జ్ఞాపకం రాకుండా ఉన్నాడు. ముష్టివాళ్లు నిత్యం మనకెదురౌతారు. ఇతన్నికూడా ఎక్కడో చూసి ఉంటాను. పైగా వారు మనకు బాగా పరిచయమున్నట్లే మాట్లాడుతారు. ఆ తెగకు చెందినవాడే ఇతడు కూడా అనుకున్నాను. కాని ఎక్కడ చూసానా అని ఆలోచిస్తుండగా మిమ్మల్నేనండి సన్యాసి రావుగారు. ఆకలేస్తుంది. పావలా డబ్బులుంటే కాఫీ కిప్పించండి అన్నాడు సగం చచ్చిన వాడులా. నాపేరు పెట్టి పిలచేసరికి ఉలిక్కి పడ్డాను.

ఏ వూరు నీది అన్నాను.

మాది ఏలూరు లెండి అన్నాడతడు.

నాపేరు నీకెట్టా తెలుసు అని అడిగాను.

తెలుసు లెండి అన్నాడు.

మరి నీపేరు ?

వణుకుతున్న గొంతుకతో నా పేరా ?......... ఎందుకు లెండి అంటూ పోబోతున్నాడు. అదేంటోయ్ పేరడిగితే వెళ్ళిపోతున్నావు అన్నాను. తడబడుతూ నా పేరు నారాయణస్వామి లెండి అని అబద్ధమాడాడు. కళ్లంట నీటిచుక్కలు జలజలా రాలుతున్నాయి. పేరు చెప్పమంటే ఎందుకేడుస్తున్నాడు చెప్మా అనుకున్నాను. అతని చూపులు ఆ మాటల తడబడ్డం చూస్తే అసలు పేరు చెప్పలేక మరొకపేరు ఏదో చెప్తున్నట్టు అనుమానించాను. నిన్ను ఎక్కడో చూసినట్లుంది. కాని జ్ఞాపకానికి రాకుండా ఉన్నావు. అసలు నీపేరు నారాయణస్వామేనా ? ఏదో అబద్ధమాడుతున్నావు కదూ ? నాకు తెలుసులే. ఇప్పుడు జ్ఞాపకానికి రాకపోయినా మరో అరగంటకైనా జ్ఞాపకానికి రాకపోతావా ? అప్పుడు తెలియక పోతుందా. ఇంతకీ పేరు చెప్పడంలో చిన్నతనమేముంది అన్నాను ఓదారుస్తున్నట్లు. దానితో అతను సరియైనపేరు చెప్పక తప్పింది కాదు. నా పేరు కోట్ల ఆంజనేయులండి. ఏలూరులో ఆ ఆంధ్ర టుబాకో కంపెనీ మాదేనండి. అప్పుడూ మీరు మీ మామయ్యతో కలసి మా కొట్టుకు సరుకు ఖరీదు చేయడానికి వస్తుండేటట్టు జ్ఞాపకం అన్నాడు దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ అప్పటికి గాని ఫలానా అని పోల్చుకోలేక పోయాను. జ్ఞాపకం వచ్చినతరువాత చేయెత్తి దండం పెట్టాలనుకున్నాను. కాని ప్రక్కవాళ్లను చూసి చేతులెత్తలేక పోయాను. ఎందుచేతనంటే బికారిలా ఉన్న అతనికి దండం పెట్టే నన్ను పిచ్చివాడనుకుంటుంది లోకం. అరే! ఎంతటివారు ఎలా మారిపోయారండి. మీ రిలా.———నామాట పూర్తికాకముందే. ఏం చేస్తాను చెప్పండి ? అదృష్టం అనుకూలంగా లేనప్పుడు బంగారం పట్టుకున్నా మన్నవుతుంది అన్నాడు గుటకలు మ్రింగుతూ. అవును లెండి నాకిప్పుడంతా జ్ఞాపకమొస్తుంది. మిమ్మల్నెరగని వారు మీ సొమ్ము తిని బ్రతకని వారంటూ ఉన్నారా ? నాకు పూర్తిగా తెలియక పోయినా మీ గురించి చెప్పుకోవడం వినేవాడినిగా. మీవంటి దయార్ద్ర హృదయులు లోకంలో అరుదని. అవును పాపం. పూలనమ్మిన చేతితోనే కట్టెలమ్మవలసి వస్తుంది. ఏ కాలాని కెలా ఉంటామో ఎవరు చెప్పగల

రని అంటారు అనుభవజ్ఞులు అందుకే గాబోలు. అని ఏవో నాకు తెలిసిన సానుభూతి వాక్యాలు తెలుపుతూ జేబులో నున్న రెండు రూపాయిల కాగితం ఇచ్చాను. బాబూ! నీవు ఇప్పుడేం చేస్తున్నావు అన్నారు అంజనేయులు గారు.

మీరప్పుడు ఇప్పించిన ఉద్యోగమేనండి.

అంతా కులాసాగా ఉన్నారు కదూ?

ఏదో మీ కృపవల్ల. అప్పుడు మీరేగాని నాకా సహాయం చేయక పోతే నే నీపాటికి——అన్నాను.

ఏమీ కాదు. అంతా భగవత్కృప. ఏదెలా జరగాలో అదలా జరగక తప్పదు అన్నాడతను. సరే వెళ్ళి వస్తానండి ఆంజనేయులుగారు అని చెప్పి నాదారిని నే నింటికి చేరుకున్నాను.

దారి వెంబడి నడుస్తున్నానన్న మాటేగాని నా ఆలోచనలన్నీ ఆంజనేయుల మీదకే పరిగెత్తున్నాయి. నా కళ్ల ముందు ఆంజనేయుల దానవదనమే మెదలుతున్నది. ఎంత వాడెలా అయిపోయాడు. కాలం మనుష్యులను మార్చేస్తుందనడంలో ఆశ్చర్య మేముంది? వ్యాపారం బాగా జరిగే రోజుల్లో ఆంజనేయులుగారు ఇస్త్రీ చేసిన శుద్ధ ఖద్దరు ధరించి కేష్ పెట్టిముందు కూర్చుంటే ఆ కూర్చోవడంలో ఠీవి, ఆ చూపులో అందం ఆ మాటలలో పేదలయెడ గౌరవభావం ఆదరణ తొణకని కుండలా కనిపించేవాడు. అవన్నీ ఇప్పుడేమైనాయి? మొదలైన ఆలోచనలతో ఇంటికి చేరుకున్నాను. ఇంటికి చేరుకున్నా ఇవే ఆలోచనలు. మా ఆవిడవచ్చి మొదట నన్నేదో అడిగింది. నేను సరిగా వివిపించుకోలేదు. ఏంటంటీ! అడిగిన దానికి సమాధానం చెప్పరేం. ఏంటంత తీవ్రంగా ఆలోచించేస్తున్నారు అన్నది గదమాయిస్తూ. తెప్పరిల్లి కొని ఆఁ ఏమీ లేదు అని సమాధానం చెప్పాను. ఇంతలో మామయ్య ఇంటిలోకొచ్చి సన్యాసి రావు వచ్చాడా అని మా అమ్మనడగడం విన్నాను. ఆఁ ఇక్కడే ఉన్నాను మామయ్యా అన్నా లోపల ఆయనే తిన్నగా నాగదిలోకి వచ్చేసారు. మామయ్యా! ఈవేళ కోట్ల ఆంజనేయులు గారు కనిపించారు అన్నాను. ఎక్కడ నాయినా కనిపించారు అని అడిగారు మామయ్య.

నేను "నేషనల్ రెస్టారెండ్" లో కాఫీ త్రాగి పైకి వస్తుండగా పావలా డబ్బులుంటే ఇప్పించండి అన్నారు. అప్పటికీ పోల్చుకోలేక పోయాను. నా పేరు పెట్టి పిలిచారు. కొంతసేపు మాట్లాడినాక తనపేరు చెప్పడానికి మొదట సిగ్గుపడుతూ తరువాత తనపేరు చెప్పారు కోట్ల ఆంజనేయులు గారని. ఎలా అయిపోయారనుకున్నారు. అప్పటికీ ఇప్పటికీ పోలికే లేదు అతనిలో. పాపం! కాఫీ త్రాగడానికి డబ్బు లేనంత కటికి దరిద్రుడై పోయారు. ఆంజనేయులు గారికి అన్నదమ్ములు బంధువులు ఉండాలని మీరు అప్పుడప్పుడూ చెప్పేవారు. వాళ్ళంతా లేరా మామయ్యా ఇప్పుడు అని అడిగాను.

లేకేం అంతా బ్రతికి బాగానే ఉన్నారు అన్నారు కోపం వెలిబుచ్చుతూ మా మామయ్య.

వాళ్ల అన్నదమ్ములందరికంటె ఆంజనేయులే పెద్దవాడు. ఇంజనేయులు గారికి ముగ్గురు తమ్ములు ఉన్నారు. గొప్ప ఇంటిలో పుట్టినవారే. వివాహానంతరం అన్నదమ్ములంతా విడిపోయారు. ఎవరికి తోచినట్లు వారు వ్యాపారాలు చేసుకుంటున్నారు వాళ్ల కుటుంబంలో ఈయనొక్కడే పొగాకు వ్యాపారం చేస్తుండేవాడు. ఎప్పుడూ భారీ ఎత్తున వ్యాపారం చేస్తుండేవాడు. తన సత్ప్రవర్తన వల్ల నోటి మంచితనంవల్ల పలుకుబడి హెచ్చిపోయింది. పలుకుబడితో పాటు వ్యాపారం హెచ్చవుతుంది రోజు రోజుకీ వ్యాపారం బాగానే సాగుతుండేది. ప్రతీ సంవత్సరం లాభాలుగూడా మస్తుగానే వస్తూండేవి. వ్యాపారం భాగా జరుగుతుండే రోజుల్లో ఆయన కంపెనీలో రోజూ యేభై అరవైమంది కూలీలు విరామం లేకుండా పనిచేసేవారు. ఎప్పుడు చూసినా ఆయన కొట్టు మార్కెట్టులా బిజీగా ఉండేది. గుమస్తాలు సుమారు డజనువరకు ఆయన కంపెనీలో పనిచేసేవారు. అంతపెద్ద వ్యాపారమన్నమాట తెలుసా అన్నారు మామయ్య. అప్పుడప్పుడూ మీతో వచ్చి నేను గూడా చూస్తూ ఉండేవాడను కదు మామయ్యా అన్నాను. మళ్లా ప్రారంభించారు. ఎవడెంత డబ్బిస్తున్నాడో ఎవడెంత సరుకు పుచ్చుకుంటున్నాడో కూడా తెలిసేది కాదు. ఆంజనేయులు గారికి గుమస్తా ఇచ్చిన డబ్బు లెక్కపెట్టుకోవడం కేష్ పెట్టిలో జాగ్రత్త పెట్టుకోవడమే ఆయన పని. పేదా సాదా వస్తే అరువిచ్చి ఆదరించేవాడు. ఆ ధర్మదాత. ఎప్పుడూ ఎవరినీ బాధించేవాడు కాదు, తమ్ములకు ఎంత కావలిస్తే అంత ఇస్తుండేవాడు. తన

డబ్బు తనకిచ్చేయమని ఎప్పుడైనా అడిగేవాడు కాదు. అన్న సంచితవాన్ని బట్టి వారిష్టమొచ్చినట్లు డబ్బున్నన్నాళ్లు ఆంజనేయుల గారిని వాడుకున్నారు అన్నదమ్ములు. అన్నదమ్ములకు ఏది కావలసినా లేదనకుండా ఇచ్చేవాడు. ఇహ బంధువులమాట చెప్పనక్కర్లేదు. మడతల దండులా వచ్చి పడేవారు. వాళ్లిష్టమొచ్చినన్నాళ్లుండి సూదుల్లా వచ్చి దబ్బనాలులా పోయేవారు. అప్పుడప్పుడూ ఆంజనేయులుగారి భార్య అంటుండేది. కలిమిలో అంతా చుట్టాలేనండి. మనకి లేకపోతే ఎవరైనా చూస్తారా? ఏం? అనేది. ఆ మాటకు ఆయన నవ్వి ఉన్నది కాబట్టే వచ్చి తినిపోతున్నారు. లేకపోతే వారు రానూ రారు మనం పెట్టేదీ లేదు అని జబాబు చెప్పేవారు చిరునవ్వు మొహంతో.

ఆంజనేయులుగారి పేరు వినని వారుగాని ఆతని డబ్బు తిననివారుగాని ఉన్నారా ఆ రోజుల్లో. ఆంజనేయులు గారికి అంతా మిత్రులే అంతా బంధువులే. ఆయన్ను మేము కలియుగ "కర్ణుడు" అని పిలిచే వాళ్లం. కొందరు ఆయన్ను గాంధీ ఆంజనేయులు అని పిలచే వారు. ఎందుకో తెలుసా మల్లెపువ్వులాంటి తెల్లని హృదయం కలవాడనిన్నీ పేదలంటే ప్రేమనిన్నీ, ఆయన వ్యాపారం చేస్తున్నన్నాళ్లు ఆయ నింటిపేరే ఎవరికీ తెలసేది కాదు. అంతా గాంధీ ఆంజనేయులనే పిలచేవారు. నీకు తెలీదులే. లాభం రావాలంటే గాంధీ ఆంజనేయులు కొట్టులో సరుకు కొనవలసిందే అనుకొనేవారు వర్తకులందరూ. ఎవరికే కష్టం వచ్చినా ఆంజనేయులుగారు ఆదుకోవలసిందే. అంతెందుకు. ఆయనప్పుడు సహాయం చేయకపోతే నీకు ఉద్యోగం దొరికేదేనా అన్నారు. అవునని తల వూపాను.

ఏమయిందో తెలుసా? ఆ సంవత్సరం ఆంజనేయులు గారు ఎక్కువ పుగాకు ఖరీదు చేసారు. చెప్పాలంటే ఎక్కడెంత కొన్నారో ఆయనకే తెలీదు. హఠాత్తుగా ధరలు సగానికి సగం పడిపోయాయి. పది వందలకు కొన్న పుగాకు అయిదు వందలకు కూడా అమ్ముడుపోయేది కాదు. మూడు సంవత్సరాలపాటు మార్కెట్టులో పెరుగదల కనుపించలేదు. బాకీలు ఇవ్వవలసిన వారు ఎగనామాలు పెట్టారు. నీకు వ్యాపారంలో అనుభవం లేదు కాని వ్యాపారంలో లాభ మొస్తే ఒక్క లాభమే


## వేప్రిన్

దెబ్బలు, కురుపు, తామర, ఎక్జిమా, గజ్జి, సుఖ వ్యాధులవలన కలిగిన పుండ్లు, తేలుకుట్టు, మూల శంఖ, కాల్పులు మొదలైనవాటిని అద్భుతంగా నివారణచేస్తుంది. కొత్త చర్మం త్వరగా వచ్చేటందుకు సహాయ పడుతుంది. ప్రతి ఇంటా తప్పనిసరిగా డాక్టరులా వుండితీరాల్సిన ఔషధం.

$\frac{1}{4}$ ఔ. సీసా అణాలు 9. $\frac{1}{2}$ ఔ. సీసా రు. 1.

## హాత్రిన

అతిసారానికి, జిగట, రక్తవిరోచనాలకి
అద్భుతమైన ఔషధం,
అతిసారం, జిగట, రక్తవిరోచనాలు, వాంతులు
జబ్బువల్ల వచ్చిన జ్వరం వీటిని తగ్గించును.
అసాధ్యమైన జబ్బులన్నీ ఈ మందుకి
సాధ్యమౌతాయి.

6 మాత్రలు గల పేకట్ 6 అణాలు.

## క్యాప్సినాల్

దగ్గు, రొంపల్ని అశ్రద్ధగా చూడకండి,
ఎందుకంటే ఊపిరితిత్తులలో రకరకాల వ్యాధుల్ని తీసుకొస్తుంది. అలా రాకుండా 'క్యాప్సినాల్' సహాయపడుతుంది.

దగ్గులు, రొంపలు, ఇన్ఫ్లుయన్జా మొదలైన వ్యాధుల్ని నివారణచేస్తుంది.

6 మాత్రలు గల పేకట్టు 4 అణాలు.
4 ప్యాకట్లకు తక్కువ వి. పి. లో పంపబడదు.

అన్ని షాపులలో దొరకును.

ధి లస్టర్ మ్యానుఫాక్చరింగ్ కంపెని,
చిక్ పేట. బెంగుళూరు సిటీ.

కనిపిస్తుంది. కాని నష్టం వస్తే అంతా నష్టమే. వడ్డీ నష్టం ఖర్చులు నష్టం. ఆఖరికి తిన్న తిండి గడిపిన కాలం గూడా నష్టం క్రింద జమ కట్టవలసిందే. ఆ దెబ్బతో ఆస్తంతా పోగొట్టుకొని దివాలా తీసాడు. వందలకొద్దీ అప్పులు తీసుకున్నవాళ్లు పది రూపాయలడిగితే లేవని చెప్పి చల్లగా జారుకుంటున్నారిప్పుడు. ఆంజనేయులుగారి డబ్బు తిని బాగా బలసిన తన బంధువులు తమ్ముళ్లూ ఆయన్నిప్పుడు ఖాతరు చేయలేదంటే నీ కిప్పుడాశ్చర్యంగా ఉంటుంది కదూ ?

వ్యాపారం చేయవలసి వస్తే మా అన్నయ్యే చేయాలోయ్. వ్యాపారానికి లాయకీ అయిన మనిషి. వ్యాపారంలో ఆ చురుకుదనం ఆ తెలివి తేటలు అందరికి అబ్బుతాయా అని పొగిడే తమ్ముళ్లూ బంధువులూ అతని నిప్పుడు ఎంత చులకనగా విమర్శిస్తున్నారో తెలుసా ?

వ్యాపారం చేయగానే సరా దేనికైనా ఒక హద్దూ పద్దూ ఉండ నక్కర్లే. డబ్బుంది కదా అని ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తే ఇంతే మరి అని ఒక తమ్ముడు, పెద్ద పరుగులు పరిగెడ్తే ఏమౌతుందని మరొక తమ్ముడు, ఆ బరువో, భారమో ఆయనే కదా మోస్తాడు మనకేం అని మరొక బంధువు, పదివేలు వచ్చేటప్పుడు ఎవరికైనా ఇచ్చేసాడు గనుకనా ఇప్పుడెవరినైనా అడగడానికి అని మరొక తమ్ముడు, గొప్పవాడవని అంటే ఉబ్బిపోయి బోలా అంటే బుర్ర గొరుక్కున్నవాళ్లగతి ఇంతే ఆఖరికి అని మరికొందరూ విమర్శించేవారు.

వ్యాపారానికి ధైర్యమే ప్రధానమోయ్. ధైర్యే లక్ష్మీ సాహసే అని ఊరకే అన్నారా. తెగించి వ్యాపారంచేయకపోతే ఈలాభాలు కళ్ళచూడగలడా ఆంజనేయులు అని పొగిడే పెద్దమనుషులే నష్టంరాగానే పెద్ద పరుగులు పరుగెడ్తే లాభమేమిటని, గొప్పవాడవని అంటే ఉబ్బిపోయి ప్రజలక్రింద ఖర్చుపెట్టేశాడనిన్నీ ఇష్టమొచ్చినట్లు విమర్శిస్తున్నారు. లాభాలు వచ్చేటప్పుడు ఉండే చురుకుదనం తెలివితేటలు ఇప్పుడెక్కడికి పోయాయని ఆలోచించేవారు ఒక్కరూ లేకపోయారోయ్ సన్యాసిరావ్. చూడు మరి కాలమహత్యం. చూడు ఒక్కొక్కరి మనస్తత్వాలు ఎలాగున్నాయో అన్నారు మామయ్య తనకున్న అనుభవాన్ని తెలుపుతూ.

ఇటువంటప్పుడు ప్రభుత్వం ఆదుకుంటే బాగుంటుంది కనుక మామయ్యా అన్నాను: ఇప్పుడు కాదోయ్. దానికింకా టైముంది అన్నారు మామయ్య.

అంటే ?

లాభాలు వచ్చేటప్పుడు.

లాభాలు వచ్చేటప్పుడు ఆదుకోవడం ఏంటి మామయ్యా అన్నాను ఆశ్చర్యంగా.

నష్టాలు వచ్చేటప్పుడు ప్రభుత్వం ఆదుకోదు. దానికేం సంబంధముండదు. లాభాలు వస్తే రాబడి పన్నని, వృత్తి పన్నని, తలపన్నని, వల్లకాడుపన్నని, దిబ్బపన్నని, ‘ఆ’ పన్నని “ఈ” పన్నని ఒకటేమిటి అన్నీ పన్నులే. బెల్లంచుట్టూ ఈగలు చేరినట్లు లాభాలువస్తే అన్నీ పన్నులే. అదేనోయ్ ప్రభుత్వవిధానం. ప్రభుత్వం ఆవిధంగా పన్నులద్వారా ఆదుకుంటుంది తెలుసా అన్నారు మామయ్య. నాకు నవ్వొచ్చింది.

నీకు చెప్పడం మరిచాను. మొన్న చిన్న విషయం జరిగిందోయ్. ఆరోజు సత్యంగాడు నీలాగే కాఫీ త్రాగి క్లబ్బునుంచి వచ్చేస్తున్నాడట పాపం. ఆంజనేయులుగారు దారిలో కనబడి నిన్నడిగినట్లే అడిగారట. మొదట పోల్చుకోనట్టు నటించాడట. తరువాత తనపేరు కూడా చెప్పారట ఆంజనేయులు. పోరా, బికారివెధవలు మారు పేర్లుకూడా చెప్పుకొని అడుక్కుంటారు. సిగ్గు ఉండ నక్కర్లే. డబ్బులేకపోతే కూలోనాలో చేసుకోవాలిగాని అడుక్కోవడం ఏంటి అని చీదరించుకుంటూ తప్పించుకు పోయాడట. చూసావా? కాలం ఎలాగుందో. వాడా ? ఆ సత్యమేనా? వాడే అన్నాడూ అలాఅని.

అవునోయ్ వాడే. ఆ సత్యంగాడే. ఆంజనేయులుగారి కొట్లో గుమాస్తాపని చేసుకొని కానీ పరక వెనకేసుకున్న కుక్క.

అరే! ఎంతనీచుడు మామయ్యా ఆ సత్యం. అలా అనడానికి వాడినోరెలావచ్చింది మామయ్యా అన్నాను అమాయికంగా.

వాడొక్కడే ఏంపాపం చేశాడని? లోకం అంతా అలాగే ఉంది. అతని అన్నదమ్ములే అతన్ని ఖాతరు చేయనప్పుడు ఇతరులేమైనా అనడంలో ఆశ్చర్యమేముంది?

ఏంటీ ? ఖాతరు చెయ్యడంలేదూ? అన్నాను.

నిజమేనోయ్. నేనేం అబద్ధంచెప్తున్నా ననుకుంటున్నావా? మొన్నను వాళ్ల తమ్ముడిని పదిరూపాయ లడిగితే నాదగ్గరెక్కడివి. నేనే పిల్లలతో చచ్చిపోతున్నానన్నాడట. మొన్న ఆంజనేయులు నాకు కలిసి ఈ భోగట్టా అంతా చెప్పి కంటతడిపెట్టారు.

చూసావుకదూ? లోకం అంటే అనుభవంలేనివాడవు. నీకంతా ఆశ్చర్యంగానే వుంటుంది మరి. డబ్బున్నప్పుడు ఆంజనేయులుగారిని మావాడంటే మావాడని చెప్పుకునే వారంతా ఇప్పుడు ఆంజనేయులుగారిని తనవాడని చెప్పుకోవడానికి సిగ్గుపడుతున్నారోయ్. గాంధీ అని పిలవబడే ఆనాటి పేరుకి నాంది లేకపోయిందీనాడు. మాట్లాడితే ఏమడుగుతాడో అని తప్పించుకు తిరుగుతున్నారోయ్ ఆంజనేయులుకు తెలిసినవాళ్ళంతా. చూశావా? కాలం ఆంజనేయుల్ని బంధువులనుండి తమ్ములనుండి, మిత్రుల నుండి ఎలా దూరం చేసేసిందో. కాలాన్నిబట్టి మనస్తత్వాలుకూడా మారిపోతాయి కాబోలు. వుత్తనే అన్నారా పెద్దలు బల్లే జడలౌతాయని ఓడలే బల్లవుతాయనిన్నీ. తనంటే గౌరవంగాని అభిమానంగాని ఎవరికీ లేదు. అందుకే ఆయన పాపం తన ఊరువిడిచిపెట్టి పై ఊళ్లలో తెలిసినవాళ్లను......అన్నారు మామయ్య రుద్ధకంఠంతో. అప్పుడప్పుడూ తనలో తనే ఏదో మాట్లాడుకుంటుండాడట. మొన్న ఒకాయన చెప్పారు అని మామయ్య లేచిపోయారు.

కాలం ఒక్కమాదిరిగా వుండదు. కాలం మనుష్యులను నామరూపాలులేకుండా చిన్నాభిన్నం చేసేస్తుంది. అదే కాలానికున్న వైపరీత్యం.


## కథాంజలి

| | |
|---|---|
| విడిప్రతి | 0-4-0 |
| సం॥ చందా | 4-0-0 |

(ప్రత్యేక సంచికలతోసహా)

**అన్ని హిగ్గిన్ బాదమ్స్ బుక్ స్టాల్స్ లోనూ దొరకును.**


# సామెతలు

1. జన్మమే కర్మము.
2. స్వభావమే ధనము.
3. కష్టేఫలే.
4. ముందు ఆలోచన, తర్వాత పని.
5. అవసరమందు స్నేహితుడే నిజమైన మిత్రుడు.
6. వజ్రమును కోయుటకు వజ్రాన్నే ఉపయోగించాలి.
7. తన్నుమాలిన ధర్మము మొదలు చెడ్డ బేరము.
8. సాధుసాంగత్యము సర్వశ్రేయములకు మూలము.
9. ఒకరత్నముతో గులకరాలు గంపెడయినను సరిగావు.
10. జలముమీద బండ్లు నేలమీద నావలు నడువవు.
11. రోటిలో తలదూర్చి రోకటిపోటుకు వెఱవరాదు.
12. వేళకు నిద్రించి, వేళకు లెమ్ము.
13. పద్మరాగ గనిలో గాజు పుట్టదు.
14. ద్రుమానులేని దేశమందు ఆముదపు చెట్టు మహావృక్షము.
15. సత్యమే జయము.

—ఊటుకూరి ప్రసన్న కుమార్, గుంటూరు.